మరో రెండు అల్పపీడనాలు ?

● రేపటి నుంచి భారీవర్షాలు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వరుసగా రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని, వీటి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 17 నుంచి డిసెంబరు 7వ తేది వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ నిపుణులు తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ జిల్లాలు, పశ్చిమ కనుమల జిల్లాలు, దిండుగల్, మదురై, తేని, విరుదునగర్, రామనాథపురం, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాల్లో మంగళవారం చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. విల్లుపురంలో 20 మి.మీ, కోయంబత్తూర్ కోలార్‌పట్టిలో 25, పొల్లాచ్చిలో 21, తాలిలో 22, ఉడుమలైపేటలో 23, మడతుకులంలో 49, కొడైకెనాల్‌లో 61, తెన్‌కాశిలో 72 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ క్రమంలో, మయన్మార్ నుంచి దక్షిణ దిశగా పయనించి, ప్రస్తుతం మధ్య బంగాళాఖాతం ప్రాంతానికి చేరుకున్న అల్పపీడనం శ్రీలంకకు ఆగ్నేయంగా కొనసాగుతున్న వాయుప్రసరణ రెండూ హిమాలయ ప్రాంతం నుంచి గాలి లాగుతున్నాయి. హిమాలయాల చల్లని గాలిగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తుండడంతో, ఉదయం మంచు కురుస్తోంది. ఈ ప్రభావంతోనే మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడన ప్రాంతం 14న పశ్చిమ దిశగా పయనించే అవకాశముంది. ఈ అల్పపీడనం రాష్ట్రానికి 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమైనప్పటి నుంచి 21వ తేది వరకు చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశముంది. అనంతరం అల్పపీడనం బలపడి అరేబియా సముద్రం వైపు కదలి, దక్షిణ చైనా సముద్రంలో బలహీనపడి, పశ్చిమ దిశగా కదలి 22న తీవ్ర వాయుగుండంగా బంగాళాఖాతంలో చేరుకుంటుంది. ఈ వాయుగుండం రాష్ట్రంలో తీరం దాటే అవకాశముంది. ఈ కారణంగా, తిరువళ్లూర్ జిల్లా నుంచి కన్నియాకుమారి వరకు 26వ తేది వరకు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. డెల్టాలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. అంతేకాకుండా, నవంబరు చివరి నాటికి మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, ఈ ప్రభావంతో డిసెంబరు 7వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ నిపుణులు తెలిపారు.

స్టాలిన్ సమక్షంలో 500 మందికి డీఎంకే తీర్థం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని అన్నా అరివాలయంలో అన్నాడీఎంకే, టీవీకే, బీజేపీ తదితర పార్టీలకు చెందిన సుమారు 500 మంది డీఎంకే సభ్యత్వం స్వీకరించారు. బుధవారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో వీరికి పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఇతర పార్టీల జిల్లా శాఖాధ్యక్షులు ఈరోడ్ సామి, శివసుబ్రమణ్యం, గణేశన్ తదితర ప్రముఖులు కూడా స్టాలిన్‌ను సత్కరించి పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నారు. డీఎంకే శివగంగ జిల్లా కార్యదర్శి, సహకార శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్, పార్టీ ప్రజాసంబంధాల విభాగం ఉపాధ్యక్షుడు మరుదు అళగురజ్, విద్యార్థి విభాగం డిప్యూటీ కార్యదర్శి రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



అన్నా అరివాలయంలో డీఎంకే సభ్యత్వం స్వీకరించిన ఇతర పార్టీల వారితో సీఎం స్టాలిన్, మంత్రి కేఆర్ పెరియకరుప్పన్

స్టాలిన్‌తో వైగో భేటీ...

ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో బుధవారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆ సందర్భంగా వచ్చే యేడాది జనవరి 2న మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని కోరుతూ తిరుచ్చి నుంచి మదురై వరకు ఆయన పాదయాత్ర నిర్వహించనున్నారు. అదే సమయంలో తన పాదయాత్ర సందర్భంగా డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలపై కూడా ఆయన ప్రచారం చేయనున్నారు. స్టాలిన్ ప్రారంభించే ఈ పాదయాత్ర సందర్భంగా ఏర్పాటయ్యే సభలో టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై, సీపీఐ, సీపీఎం నేతలు తదితర డీఎంకే మిత్రపక్షాల నాయకులు పాల్గొననున్నారు. ఈ పాదయాత్ర ఏర్పాట గురించి, పాదయాత్ర ప్రారంభించేందుకు ఆహ్వానించడానికి స్టాలిన్‌ని కలుసుకున్నట్లు వైగో విలేఖరుల సమావేశంలో తెలిపారు.

సృష్టిలో భక్తి, ధర్మం, సేవలు శాశ్వతం

● త్రిదండి చిన్న జీయర్‌స్వామి

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో భక్తి, ధర్మం, సేవలు శాశ్వతంగా ఉంటాయని, ప్రతి మనిషి వీటిని పాటించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి పేర్కొన్నారు. పెరంబూరులోని ఎస్పీఆర్ సిటీలో సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో సమత్వ, శాంతి, సౌఖ్యాభివృద్ధి కోసం మహాయజ్ఞంగా ప్రారంభమైన స్వాస్తాహ్నిక పంచ కుండాత్మక 'సమతా ఇష్టి' ఏడో రోజు కార్యక్రమం బుధవారం వైభవోపేతంగా జరిగింది. ప్రజలు ఆర్థికంగా ఎదిగి సుఖంగా ఉండాలని 'శ్రీ లక్ష్మీ నారాయణ ఇష్టి' శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 8గంటలకు చిన్న జీయర్‌స్వామి ఆధ్వర్యంలో తీర్థగోష్ఠి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు మహా ఇష్టి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ విజయవంతంగా కొనసాగిస్తున్న జెట్-చెన్నై నిర్వాహకులు, సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. గోపురం పసుపు, కుంకుమ సంస్థ అధినేత వైవీ హరికృష్ణ, ఉమ్మిడి లలితా సుధాకర్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై తదితర ప్రముఖులు చిన్నజీయర్ స్వామి ఆశీసులందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నజీయరు అనుగ్రహ భాషణం చేస్తూ సమతా ఇష్టిని విశ్వవ్యాప్తం చేసేందుకు భక్తులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భౌతికమైన ఆనందం శాశ్వతం కాదని, అయితే భక్తి, ధర్మం, సేవ శాశ్వతమని అభిలషించారు.



తాయారు సమేత పెరుమాళ్, అర్చామూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న గోపురం కుంకుమ సంస్థ అధినేత వైవీ.హరికృష్ణ

నేత్రపర్వంగా శోభాయాత్ర....

సమతా ఇష్టి మహాయజ్ఞంలో భాగంగా బుధవారం సాయంత్రం భారీ శోభాయాత్ర నిర్వహించారు. పుళియాన్‌తోపు పోలీస్‌స్టేషన్ సమీపంలోని జంక్షన్ నుండి ప్రారంభమైన శోభాయాత్రలో చిన్నజీయర్ స్వామి జెట్-చెన్నై నిర్వాహకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల నుండి పెద్దల వరకు ఆడు తూ, పాడుతూ ఉత్సాహంగా పాల్గొన్న ఈ శోభాయాత్ర సుమారు 2 కిలోమీటర్ల వరకు సాగి తిరిగి వేదిక ప్రాంగణానికి చేరుకుంది. గురువారం ఉదయం 11 గంటలకు మహా పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.30 గంటలు శ్రీనివాస కల్యాణంతో సమతా ఇష్టి ముగియనుంది.



శోభాయాత్ర ప్రారంభిస్తున్న త్రిదండి చిన్న జీయర్ స్వామి



శోభాయాత్రలో భక్తుల కోలాటం

ఏడు నెలల్లో 342 బాంబు బెదిరింపులు

● మన దేశం నుంచే వస్తున్నాయి

● బెదిరించేవాళ్ల భరతం పడతాం

● పోలీసు కమిషనర్ అరుణ్



పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ఏడు నెలల్లో 342 బాంబు బెదిరింపులు వచ్చాయని పోలీసు కమిషనర్ అరుణ్ తెలిపారు. ఈ బాంబు బెదిరింపులు విదేశాల నుంచి రావడం లేదని, దీనిపై కొంతమంది లేనిపోని పుకార్లు పుట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజకీయ, సినీ ప్రముఖులకు బాంబు బెదిరింపులు వస్తున్నాయన్నారు. గడిచిన ఏడు నెలల కాలంలో నగరంలో 342 బాంబు బెదిరింపులు అందాయన్నారు. ఈ బెదిరింపులు 'డార్క్ వెబ్', 'వీపీఎన్' ద్వారా అందుతున్నాయని తెలిపారు. ఈ బెదిరింపులు చాలా వరకు విదేశాల నుంచి వస్తున్నటుల కనిపించడం లేదన్నారు. ఇక్కడి నుంచి ఎవరో దీన్ని పంపిస్తున్నారని అనుమానిస్తున్నామన్నారు. బెదిరింపుల పద్ధతి, ఉపయోగించిన పదాలను బట్టి చూస్తే, దీని వెనుక ఒకరిద్దరు వ్యక్తులు మాత్రమే ఉన్నారని తెలుస్తుందన్నారు. అలాగనీ, బెదిరింపులు తేలికగా తీసుకోలేమన్నా. ఈ వ్యవహారంపై ఉగ్రవాద నిరోధక దళం కూడా దర్యాప్తు చేపట్టిందన్నారు. నిందితులను త్వరలోనే అరెస్ట్ చేశామని తెలిపారు. నగరంలోని రౌడీ జాబితాలో ఉన్న 4,979 మందిని ఎ, ఏ ప్లస్, బి, సి అని నాలుగు విధాలుగా విభజించి, వారిపై నిఘా ఉంచామని, దీని కారణంగా నేరాల రేటు తగ్గిందన్నారు. ఆ ప్రకారం, గత సంవత్సరం 102గా ఉన్న హత్యల సంఖ్య 82కు తగ్గిందని, చైన్ స్నాచింగ్‌లు 35 నుంచి 21కి, సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు 275 నుంచి 144కి తగ్గాయని తెలిపారు. ప్రజలు అందజేసిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ అరుణ్ తెలిపారు.

ముల్లై పెరియార్ డ్యాం సురక్షితం

● జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ అధ్యక్షుడు అనిల్ జైన్

చెన్నై, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ముల్లై పెరియార్ డ్యామ్ పటిష్ఠంగానే ఉందని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ అధ్యక్షుడు అనిల్ జైన్ ప్రకటించారు. ఆ డ్యాం పరిరక్షణ దిశగా సుప్రీంకోర్టు దిశానిర్దేశం ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనిల్ జైన్ నేతృత్వంలో ఏడుగురు నిపుణుల కమిటీని గత యేడాది నియమించింది. ఈ కమిటీ సభ్యులు మంగళారం సాయంత్రం కేరళలోని ఇడుక్కి జిల్లా తేక్కడి రేవుకు వెళ్ళి అక్కడి నుండి పడవలో బయలుదేరి ఆనకట్ట ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. ఈ తనిఖీలో రాష్ట్ర ప్రభుత్వం తరపున జలవనరుల కార్యదర్శి జయకాంతన్, కావేరి సాంకేతిక సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం సహా ఏడుగురు సభ్యులు పాల్గొన్నారు. ఇదే విధంగా కేరళ రాష్ట్ర నీటి పారుదల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి బిశ్వంత్ సిన్హా, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ప్రియేష్, పర్యవేక్షణ బృందం సభ్యులు, జాతీయ విపత్తుల నిర్వహణ కమిటీ అధికారి రాకేష్ తోడేజా, బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధికారి ఆనంద్ రామసామి, కేరళ ప్రభుత్వ తరఫు ప్రతినిధులు తనిఖీలో పాల్గొన్నారు. ముల్లై పెరియార్ ఆనకట్ట, బేబీ ఆనకట్ట, స్లూయిజ్ గేట్లు, సొరంగ ప్రాంతంలోని నీటిమట్టం, లీకేజీ స్థాయి తదితరాలను నిఘా కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ తనిఖీలు పూర్తయిన తర్వాత మదురై అళగర్ కోవిల్ రోడ్డులోని ఓ వసతి గృహంలో నిఘా కమిటీ, రెండు రాష్ట్రాల ప్రతినిధుల సంయుక్త సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ముల్లై- పెరియార్ డ్యామ్ సంరక్షణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలు గురించి బేబీ ఆనకట్ట వద్ద ఏపుగా దట్టంగా పెరిగిన చెట్లను తొలగించేందుకు అనుమతించే అంశంపై చర్చలు జరిగాయి. ఈ సమావేశం తర్వాత జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ అధ్యక్షులు అనిల్ జైన్ మీడియాతో మాట్లాడుతూ తమ కమిటీ, రెండు రాష్ట్రాల ప్రతినిధులు జరిపిన తనిఖీలలో ముల్లై - పెరియార్ డ్యామ్ సురక్షితంగానే ఉందని స్వల్ప మరమ్మతులకు అనుమతి జారీ చేయనున్నామని తెలిపారు.



ముల్లైపెరియార్ డ్యాం పరిశీలించేందుకు వెళ్తున్న కమిటీ చైర్మన్ అనిల్ జైన్, సభ్యులు, రెండు రాష్ట్రాల ప్రతినిధులు

వచ్చే యేడాది 24 ప్రభుత్వ సెలవు దినాలు

టి.నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2026 సంవత్సరానికిగాను ప్రభుత్వ సెలవు దినాల జాబితాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం విడుదల చేశారు. ఆ జాబితా మేరకు 2026వ సంవత్సరం 24 ప్రభుత్వ సెలవు దినాలు ఉన్నాయి. వివిధశాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థ, కార్పొరేషనలకు ఈ సెలవులు వర్తిస్తాయని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాల వివరాలు ఇలా ఉన్నాయి.

ఆంగ్ల సంవత్సరాది	జనవరి 1 (గురువారం)
పొంగల్	జనవరి 15 (గురువారం)
తిరువళ్లువర్ దినం	జనవరి 16 (శుక్రవారం)
ఉళవర్ తిరునాళ్	జనవరి 17 (శనివారం)
రిపబ్లిక్ డే	జనవరి 26 (సోమవారం)
తైపూసం	ఫిబ్రవరి 1 (ఆదివారం)
ఉగాది	మార్చి 19 (గురువారం)
రంజాన్	మార్చి 21 (శనివారం)
మహావీర్ జయంతి	మార్చి 31 (మంగళవారం)
బ్యాంకుల వార్షిక లెక్కల ముగింపు	ఏప్రిల్ 1 (బుధవారం)
గుడ్ ఫ్రైడే	ఏప్రిల్ 3 (శుక్రవారం)
తమిళ ఉగాది, అంబేద్కర్ జయంతి	ఏప్రిల్ 14 (మంగళవారం)
కార్మికుల దినం	మే 1 (శుక్రవారం)
బక్రీద్	మే 28 (గురువారం)
మొహర్రం	జూన్ 26 (శుక్రవారం)
స్వాతంత్ర్య దినం	ఆగస్టు 15 (శనివారం)
మిలాద్ ఉన్ నబీ	ఆగస్టు 26 (బుధవారం)
శ్రీకృష్ణజయంతి	సెప్టెంబరు 4 (శుక్రవారం)
వినాయక చవితి	సెప్టెంబరు 14 (సోమవారం)
గాంధీ జయంతి	అక్టోబరు 2 (శుక్రవారం)
ఆయుధపూజ	అక్టోబరు 19 (సోమవారం)
విజయదశమి	అక్టోబరు 20 (మంగళవారం)
దీపావళి	నవంబరు 8 (ఆదివారం)
క్రిస్మస్	డిసెంబరు 25 (శుక్రవారం)

తమిళ జాలర్లను విడిపించండి

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈపీఎస్ డిమాండ్

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో బంధీలుగా ఉన్న తమిళ జాలర్ల విడుదలకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) డిమాండ్ చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ మత్స్యకారుడు స్వేచ్ఛగా సముద్రంలో చేపల వేటకు వెళ్ళలేకపోతున్నాడని, వారి ప్రాణాలకు, ఆస్తులకు గ్యారెంటీ లేకుండా పోయిందన్నారు. తమిళ జాలర్లను సరిహద్దులు దాటారనే కారణం చూపి శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేయడంతో పాటు పడవలు, వలలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకుని తిరిగి అప్పజెప్పడంలేదన్నారు. అన్ని రకాలుగా నష్టపోతున్న మత్స్యకారుల హక్కులను పరిరక్షించే విధంగా పాలకులు శ్రీలంక ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గత శనివారం మైలాడుదురై జిల్లా పూంపుహార్ నుంచి చేపలవేటకు వెళ్లిన 14మంది సముద్రంలో ఈదురు గాలుల వల్ల దారి తప్పి దిక్కుతోచని స్థితిలో ఉన్న వారిని కూడా శ్రీలంక నావికా దళం వదిలిపెట్టలేదన్నారు. లంక జైలులో మగ్గుతున్న తమిళ జాలర్లను విడుదల చేయించేందుకు, వారి పడవలను విడిపించాలని ఆయన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను డిమాండ్ చేశారు.




మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

దుష్ట పరిపాలనకు చరమగీతం

● టీవీకే అధినేత విజయ్ ధ్వజం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగున్నరేళ్లుగా మాయమాటలతో కపట నాటకాలాడుతున్న దుష్టశక్తుల పాలనకు చరమగీతం పాడనున్నామని, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాశక్తి విలువ తెలియజేస్తామని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నేత విజయ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. అయితే ఎక్కడా డీఎంకే పేరు ప్రస్తావించకుండా ఆ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతోందంటూ ఆరోపణలు చేశారు. ఇటీవల కాలంలో పాలన, అధికారం తమ చేతుల్లో వుందని విర్రవీగుతున్న ఓ పార్టీ ఎప్పటిలాగే ప్రత్యర్థులపై అపవాదులను, పసలేని ఆరోపణలను, విమర్శలు చేయడానికి సిద్ధమైపోయిందన్నారు. ఆ పార్టీ పేరు ఏమిటో తన ప్రకటన ద్వారానే అందరికీ ఈపాటికీ తెలిసే ఉంటుందని డీఎంకేని పరోక్షంగా ప్రస్తావించారు. అవినీతి అక్రమాలకు పెట్టింది పేరుగా ఉన్న ఆ పార్టీ ప్రస్తుతం టీవీకేపై దుమ్మెత్తి పోయడాన్నే పనిగా పెట్టుకుందని విజయ్ విమర్శించారు. 1969 నుండి ఆ పార్టీ తన ప్రత్యర్థులపై అపవాదాలు వేయడాన్నే పనిగా పెట్టుకుని అవినీతి అక్రమాలకు పాల్పడుతూనే ఉందన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ తమ సిద్ధాంతాలను తెలిపి ప్రచారం చేయడానికి బదులుగా ఎప్పటిలాగే తమిళనాడు, తమిళ భాష, తమిళ జాతి, సంప్రదాయం అంటూ ఊదిన శంఖాలనే మళ్ళీ మళ్లీ ఊది ప్రజల చెవుల్ని ఊదరగొడుతోందని విజయ్ విమర్శించారు. తాజాగా 'మేథో ఉత్సవాలు' పేరుతో అటకెక్కిన పాత గ్రంథాలను, తాళపత్రాల దుమ్ముధూళి తట్టి ప్రదర్శన శాలలు నిర్వహించే స్థితికి ఆ పార్టీ దిగజారి పోయిందని విమర్శించారు. పార్టీ పతాకం 75 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లోనూ టీవీకేపైనే విమర్శలు చేశారని, వీటన్నింటికీ తోడు 'సర్'కు వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన ధర్నాలోనూ టీవీకేపైనే తీవ్ర విమర్శలు చేశారని విజయ్ పేర్కొన్నారు. ప్రజాబలంతో దూసుకు వస్తున్న టీవీకే ధాటికి రాష్ట్రంలోని అవినీతి అక్రమాల ప్రభుత్వం కుప్పకూలి పడటం ఖాయమని ఆయన జోస్యం చేశారు.



సివిల్స్ మెయిన్స్‌లో మెరిసిన తమిళులు

● ఇంటర్వ్యూకు 162 మంది ఎంపిక

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ మెయిన్స్ ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్రానికి చెందిన 162 మంది సహా దేశవ్యాప్తంగా 2,736 మంది ఉత్తీర్ణులయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (యూపీఎస్సీ) 979 పోస్టులకు జనవరి 22న నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రం నుంచి 24 వేల మంది ఈ పరీక్ష రాశారు. మే 25న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి, జూన్ 11న ఫలితాలు విడుదల చేశారు. అందులో 14,161 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. వారికి ఆగస్టు 22,23,24,30,31 తేదీల్లో ఐదు రోజులు మెయిన్స్ నిర్వహించారు. ఈ ఫలితాలు విడుదల కాగా రాష్ట్రం నుంచి 162 మంది ఉత్తీర్ణులయ్యారు. అర్హత సాధించిన వారికి ఢిల్లీలోని యూపీఎస్సీ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలో మార్కుల ఆధారంగా, ఉద్యోగాల కేటాయింపు జరుగుతుందని యూపీఎస్సీ తెలిపింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో మాంగాడు, మాతూర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపింది.

మాంగాడు: ఆవడి రోడ్డు, మగిళం అవెన్యూ, పంచోలై వీధి, ఎంఎస్ఎస్ నగర్, అడ్కో నగర్, మేట్టు వీధి, సిపాయి నగర్, తందై పెరియార్ నగర్, కామరాజ్ నగర్, మురుగపిళ్లై నగర్, గంగై అమ్మన్ ఆలయం, వినాయక నగర్, గోరిమేడు, బజార్ వీధి, కన్నంపుల్లి చెట్టి వీధి, అమ్మన్ ఆలయ వీధి, కుండ్రత్తూర్ రోడ్డు.

మాతూర్: ఎంఎండీఏ 1 నుంచి 3 మెయిన్ రోడ్లు, ఇండియన్ బ్యాంక్, టీఎస్ హెచ్‌బీ లేక్‌వివ్ అపార్ట్‌మెంట్స్

15న జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఈ నెల 15న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సహకార శాఖ డిప్యూటీ డైరెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... సహకార సంఘాల రిజిస్ట్రార్ పరిధిలోని ప్రధాన సహకార బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీచేసేలా ఆగస్టు 6న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఇందుకు సంబంధించిన రాత పరీక్ష అక్టోబరు 5వ తేది నిర్వహించి, ఈ నెల 6వ తేది పరీక్షా ఫలితాలు విడుదల చేశామన్నారు. తాత్కాలికంగా ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 15న తరమణి సీఐటీ క్యాంపస్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు www.tncoopsrb.in అనే వెబ్‌సైట్ ద్వారా అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

25 నుంచి 'మిల్లెట్ బేకరీ' ఉత్పత్తులపై శిక్షణ

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 'మిల్లెట్ బేకరీ' ఉత్పత్తులపై ఈ నెల 25 నుంచి 27వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... ఈ శిక్షణలో బట్టర్ బిస్కట్, మిల్లెట్ మిల్క్ బిస్కెట్, మిల్లెట్ జీరా కుకీ, రాగి నట్స్ కుకీస్, చోళం చాక్లెట్ బిస్కెట్, కాంబు గీ బిస్కెట్, డబుల్ చాక్లెట్ బ్రౌనీ, రాగి చాకొలెట్ కేక్, తినై బనానా కేక్, వోల్ వీట్ బ్రెడ్, మిల్లెట్ బ్రెడ్, మిల్క్ బన్ సహా పలు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, దుకాణాలు, కర్మాగారాల ఏర్పాటుకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం వివరాలు కూడా తెలియజేయనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు శిక్షణలో పాల్గొనవచ్చు. ఈకాట్టుతాంగళ్ సిడ్కో ఎస్టేట్ ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. శిక్షణా కాలంలో యువతీ, యువకులకు తక్కువ అద్దెతో వేర్వేరుగా బస కల్పించనున్నారు. వివరాలకు 8668102600, 9943685468 (ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల్లోపు), www.editn.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

విద్యార్థుల క్రీడా పోటీలకు రూ.12.50 కోట్లు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాల విద్యార్థులకు 25 రకాల క్రీడా పోటీలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12.50 కోట్లు కేటాయించింది. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేలా జిల్లా, మండలం, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 38 జిల్లాల్లో 25 రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. అలాగే, తాలూకా, రెవెన్యూ జిల్లా పరిధిలో చెస్ పోటీలు ఏర్పాటుచేయనున్నారు. ఈ పోటీల నిర్వహణకు రూ.12.50 కోట్లు విడుదల చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వ అనుమతి మేరకు క్రీడా పోటీల నిర్వహణకు రూ.12.50 కోట్లు కేటాయిస్తూ పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చంద్రమోహన్ జీవో విడుదల చేశారు.

ప్రత్యేక చిహ్నం కోరుతూ ఎంఎన్ఎం దరఖాస్తు

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక చిహ్నం కోరుతూ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) ఎన్నికల సంఘానికి దరఖాస్తు సమర్పించింది. వచ్చే ఏడాది జరుగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. కమల్ హాసన్ నేతృత్వంలోని ఎంఎన్ఎం ఎన్నికలకు సమాయత్తమవుతోంది. అందులో భాగంగా శాసనసభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీచేసేందుకు ప్రత్యేక చిహ్నం కావాలంటూ పది చిహ్నాలతో కూడిన జాబితా అందజేసి, వాటిలో ఒక చిహ్నం కేటాయించాలని ఎన్నికల సంఘానికి ఎంఎన్ఎం దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘ కార్యాలయంలో మంగళవారం ఎంఎన్ఎం ప్రతినిధుల బృందం దరఖాస్తు సమర్పించింది. కాగా, 2021 శాసనసభ ఎన్నికల్లో ఎంఎన్ఎంకు 'టార్చిలైట్' గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది.

పోలీసు వాహనం ఢీకొని ముగ్గురి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, (అంతర్ చిత్రంలో) మృతులు అశ్విన్, అతని తల్లిదండ్రులు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనం ఢీకొని బాలుడు సహా తల్లిదండ్రులు మృతిచెందారు. మదురై సమీపం సిట్టంపట్టి ప్రాంతానికి చెందిన ప్రశాంత్ (26)-సత్య (23) దంపతులకు అశ్వంత్ (3) అనే కుమారుడున్నాడు. ప్రశాంత్ మంగళవారం బంధువుల ఇంటిలో ఓ అశుభ కార్యానికి భార్య, కుమారుడితో కలసి బైక్‌పై వెళ్లాడు. కార్యక్రమం తర్వాత, వదిన సోనా ఈశ్వరి (40)తో కలసి నలుగురు మోటార్ సైకిల్‌పై బయల్దేరారు. అంజుయార్ ప్రాంతంలో వస్తున్న మోటార్ సైకిల్ ఎదురుగా వస్తున్న పోలీసు వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రశాంత్, సత్య, కుమారుడు అశ్విన్ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రగాయాలైన మహిళను చికిత్స కోసం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసు వాహనంలో రామనాథపురానికి చెందిన మహిళా ఇన్‌స్పెక్టర్ వస్తుండగా, హెడ్‌కానిస్టేబుల్ బాల మురుగన్ వాహనం నడుపుతున్నారు. వారు మదురై నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చుట్టుపక్కల వారు అక్కడ గుమిగూడి, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అరెస్టు చేయాలంటూ ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న శివగంగ జిల్లా ఎస్పీ శివప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి వారిని శాంతింపజేశారు.

సీఎం దిగ్భ్రాంతి...

శివగంగ జిల్లాలో పోలీసు వాహనం ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను కలచివేసిందని, మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబానికి తలా రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. అలాగే, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళకు మెరుగైన చికిత్సలు అందించాలని సీఎం ఆదేశించినట్లు సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

● ఆలయ వాచ్‌మన్ల హత్యకేసు...

కాల్పులు జరిపి.. నిందితుడి అరెస్టు

టి.నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా రాజపాళయం సమీపంలోని నచ్చాడై తవిర్తరుళియ నాథ ఆలయంలో మంగళవారం వేకువజాము జరిగిన ఇద్దరు వాచ్‌మెన్ల హత్యకేసులో నిందితుడు పారిపోతుండగా పోలీసులు కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రదేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆ ఆలయానికి గుర్తు తెలియని దుండగులు రెండు కార్లలో వచ్చి సీసీ కెమెరాలను పగులగొట్టి వెనుకవైపు నుంచి ఆలయం లోపలకు దిగి పేచ్చిముత్తు, శంకర పాండియన్ అనే ఇద్దరు వాచ్‌మన్లను దారుణంగా హతమార్చి ఆలయంలోని స్వర్ణాభరణాలను, హుండీలోని కానుక నగదును దోచుకెళ్ళారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దోపిడీ దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు దళాలను రంగంలోకి దింపారు. ఈ జంట హత్యకేసులకు సంబంధించి ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీ దొంగల్లో ఒకడి ఆచూకీ తెలిసింది. ఆ మేరకు నాగరాజ్ అనే దొంగను మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. బుధవారం వేకువజాము నాగరాజ్‌ను హత్య జరిగిన ఆలయం వద్దకు తీసుకెళ్ళినప్పుడు పోలీసులపై కట్టెలు, రాళ్లతో దాడి చేసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటనలో ఎస్ఐ కోటియప్పసామి తీవ్రంగా గాయపడ్డారు. దీనింతో మరో ఎస్ఐ రమేష్‌కన్నన్ పారిపోతున్న నాగరాజ్ కాలి మీద తుపాకీతో కాల్చటంతో బులెట్ తగిలి నేలపై పడ్డాడు. ఆ తర్వాత అతడిని, గాయపడిన ఎస్ఐ కోటియప్పసామిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేబిస్‌తో ఒకరి మృతి

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేబిస్ వ్యాధి సోకి వ్యక్తి మృతిచెందిన ఘటన తిరునల్వేలిలో చోటుచేసుకుంది. వల్లియూర్ సమీపంలోని గ్రామానికి చెందిన అయ్యప్పన్ (30)కు వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. కొద్దిరోజుల క్రితం అయ్యప్పన్ రోడ్డుపై వెళ్తుండగా వీధి కుక్క కరిచింది. కానీ, అతను చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం వహించాడు. కొద్దిరోజులుగా తరచూ అనారోగ్యానికి గురవుతున్న అయ్యప్పన్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో రేబిస్ సోకినట్లు నిర్ధారించారు. రేబిస్‌తో చికిత్స పొందుతున్న అయ్యప్పన్ బుధవారం వేకువజామున మృతిచెందాడు.

లక్కీడ్రా పేరుతో ఘరానా మోసం

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లక్కీడ్రా తగిలిందని నమ్మించి ఓ మహిళ ఫోన్ నుండి రూ.45వేలు కాజేసిన మోసంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. వేలూరు జిల్లా గుడియాత్తంలోని టీచర్స్ నగర్‌కు చెందిన ఓ మహిళ టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో మీకు లక్కీడ్రాలో 70వేల అమెరికన్ డాలర్లు వచ్చాయని, అవి మీకు రావాలంటే రూ.15వేలు సర్వీస్ ఛార్జీ కట్టాల్సివుంటుందని ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆమె వాట్సాప్‌కు మెసేజ్ పంపాడు. దీనికి సంతోషించిన ఆమె ఏ మాత్రం ఆలోచించకుండా వెంటనే తన సేవింగ్స్ నుండి రూ.15వేలు జీపే ద్వారా పంపింది. అనంతరం మళ్లీ పార్శిల్ ఛార్జీ, ట్రావెల్ ఛార్జీ అంటూ మొత్తం రూ.45వేల మేరకు ఆమె జీపే ద్వారా పంపింది. ఎన్నిరోజులైన డాలర్లు రాకపోయే సరికి మళ్లీ వాట్సాప్‌లో ఆ గుర్తుతెలియని వ్యక్తికి మెసేజ్ పంపగా, అతడు లాస్ట్ ప్రాసెస్ ఫీజుగా మీరు రూ.లక్ష పంపితే మీ ఇంటికి 75వేల డాలర్లు వస్తాయని తెలిపారు. దీనితో అనుమానించిన ఆమె తను పంపిన నగదు మొత్తాన్ని రిటన్ పంపాలని కోరింది. దానికి ఎటువంటి సమాధానం రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

మృత్యువులోనూ వీడని అక్కాతమ్ముళ్ల అనుబంధం



విన్సెంట్ ఆరోగ్యనాథన్-వేలాంకన్ని థామస్ (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సోదరుడి మృతదేహాన్ని చూసి విలపించిన అక్క, హఠాత్తుగా మృతిచెందిన ఘటన బంధువులను మరింత విషాదంలో ముంచెత్తింది. నుంగంబాక్కంకు చెందిన విన్సెంట్ ఆరోగ్యనాథన్ (72)కు వేలాంకన్ని థామస్ (77) అనే అక్క ఉంది. విన్సెంట్ ఆరోగ్యనాథన్ నుంగంబాక్కంలో ఉంటున్న ఇల్లు ఖాళీ చేసి, గుడువాంజేరిలో ఉన్న తన కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో, అనారోగ్యం కారణంగా సోమవారం విన్సెంట్ మృతిచెందాడు. ఆయన భౌతిక కాయాన్ని ఈస్ట్ తాంబరం భారతమాత వీధిలోని బంధువు ఇంట్లో ఉంచారు. తమ్ముడు మరణించిన సమాచారం తెలుసుకున్న వేలాంకన్ని థామస్ విలపిస్తూ నుంగంబాక్కం నుంచి ఈస్ట్ తాంబరం చేరుకుంది. అక్కడ తమ్ముడు మృతదేహాన్ని చూసి విలపించిన ఆమె, హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు ఆమెను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తమ్ముడితో పాటు అక్క కూడా మృతిచెందడం బంధువులు, చుట్టుపక్కల వారిని కంటతడి పెట్టించింది.

తండ్రీకొడుకులపై దాడి

● రౌడీ అరెస్ట్

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓట్టేరి నమ్మాళ్వార్‌పేటలో తండ్రీకొడుకులపై దాడికి పాల్పడిన బులన్ అనే రౌడీని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నమ్మాళ్వార్‌పేట ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్, ఆయన కుమారుడు కార్తిక్ మంగళవారం రాత్రి ఇంటిముందు కూర్చొని ఉండగా, అక్కడికి ద్విచక్రవాహనంలో వెళ్లిన గుర్తుతెలియని ముఠా మారణాయుధాలతో దాడికి పాల్పడటంతో తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు ఓట్టేరి పోలీసులు కేసు నమోదు చేసి అదే ప్రాంతానికి చెందిన బులన్ అనే రౌడీని బుధవారం అరెస్ట్ చేశారు. పరారైన కుళ్లకరుప్పన్, విజయన్, గణేశన్, ముకేష్ తదితరుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నకిలీ పత్రాలతో రూ.75.80 లక్షల బ్యాంకు రుణం

● ఇద్దరి అరెస్ట్

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ విక్రయ పత్రాలు సృష్టించి, బ్యాంకు నుంచి రూ.75.80 లక్షల రుణం పొందిన కేసులో, కేంద్ర నేరవిభాగం పోలీసులు ఢిల్లీలో ఇద్దరిని అరెస్ట్ చేశారు. స్థానిక గిండికి చెందిన అబ్దుల్ ఖాదర్ (65) తన కుమార్తె వివాహం కోసం తన మిత్రుడికి స్నేహితుడైన మడిపాక్కంకు చెందిన వినాయక ఆచారిని సంప్రదించాడు. అందుకు వినాయక ఆచారి, అబ్దుల్ ఖాదర్‌కు చెందిన స్థలాన్ని విక్రయించాలని నిర్ణయించి, అందుకు పవర్ ఆఫ్ అటార్నీగా నమోదుచేయించుకున్నాడు. అనంతరం నకిలీ పత్రాలు సృష్టించి సేలంకు చెందిన సుజాతకు స్థలం విక్రయించాడు. ఆ తరువాత ఆ విక్రయ పత్రాలు సమర్పించి ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.75.80 లక్షల రుణం తీసుకున్నాడు. కొద్దిరోజుల తరువాత ఈ మోసం తెలుసుకున్న అబ్దుల్ ఖాదర్, వినాయక ఆచారి, అతడికి సాయం చేసిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కేంద్ర నేరవిభాగం పోలీసులు, మడిపాక్కంకు చెందిన వినాయక ఆచారి తన భార్య దాక్షాయణి, స్నేహితుడు శివ, ఆయన భార్య సర్మియ, సుజాత తదితరులతో కలసి నకిలీ క్రయ పత్రాలు సృష్టించి రుణం పొందినట్లు తెలిసింది. ఈ కేసులో గత ఏడాది మార్చిలో శివను పోలీసులు అరెస్ట్ చేసి, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, వినాయక ఆచారి, ఆయన స్నేహితురాలు సుజాత ఢిల్లీలో ఉన్నట్లు తెలుసుకున్న కేంద్ర నేర విభాగం పోలీసులు ఈ నెల 7వ తేది ఢిల్లీ వెళ్లి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వేలూరు కోర్టుకు ఎంపీ కదిర్ ఆనంద్



కోర్టు నుంచి బయటికి వస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల విచారణకు బుధవారం ఉదయం ఎంపీ కదిర్ ఆనంద్ వేలూరు కోర్టులో హాజరయ్యారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు ఓటుకు నగదు పంపిణీ, ఈడీ తనిఖీల్లో ఎంపీ ఇళ్లు, కాట్పాడి పాతబస్టాండ్ వద్దనున్న అతని కళాశాలలో రూ.11 కోట్ల మేరకు నగదును స్వాధీనం చేసుకుని ఎంపీ అనుచరుడు పూంజోలై శ్రీనివాసన్ సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, ఈడీ తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. అనంతరం ఈ కేసును న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రూ.2 కోట్ల విలువైన బంగారు కడ్డీల చోరీ

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాషర్‌మెన్‌పేట ప్రాంతంలోని దుకాణంలో రూ.2 కోట్ల విలువైన బంగారు కడ్డీలు చోరీకి గురయ్యాయి. పురుషవాక్కం సమీపంలోని పూందమల్లి హైరోడ్డు దాసప్రకాశం ప్రాంతానికి చెందిన హరీష్, పాత వాషర్‌మెన్‌పేటలో బంగారు కడ్డీలు కొనుగోలు చేసి, వాటితో నగలు తయారుచేసే దుకాణం నడుపుతున్నాడు. ఈ దుకాణంలో ఉత్తరాదికి చెందిన ఏడుగురు యువకులు పనిచేస్తున్నారు. వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్తీక్ బోరా, పప్పన్‌రాయ్, నారాయణన్ మైటీ ఉన్నారు. కార్తీక్ బోరా బంధువు వీరితో పాటు నెలరోజులుగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి హరీష్, అతని స్నేహితుడు గౌతమ్‌తో నగలను సరిచూసిన అనంతరం హరీష్ ఇంటికి వెళ్లగా, గౌతమ్ దుకాణంలోనే ఉన్నాడు. అర్ధరాత్రి కార్తీక్ బోరా సహా నలుగురు అదృశ్యం కావడం గమనించిన గౌతమ్, ఈ విషయాన్ని హరీష్‌కు తెలియజేశాడు. హరీష్ దుకాణానికి చేరుకుని నగలు పరిశీలించగా, రూ.2 కోట్ల విలువైన కిలో785 గ్రాముల బంగారు కడ్డీలు అదృశ్యం కావడం గుర్తించారు. హరీష్ ఫిర్యాదుతో కొరుక్కుపేట క్రైం విభాగం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల ఆచూకీ కోసం రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు.

రౌడీ కరుక్కా వినోద్‌కు పదేళ్ల జైలు

● పూందమల్లి ఎన్ఐఏ కోర్టు తీర్పు



రౌడీ కరుక్కా వినోద్‌ను కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని రాజ్‌భవన్ ముందు 2023 అక్టోబర్ 25న పెట్రోల్ బాంబ్ విసిరిన కేసులో రౌడీ షీటర్ కరుక్కా వినోద్ కు పూందమల్లి ఎన్ఐఏ కోర్టు పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు నిచ్చింది. బెయిల్‌పై విడుదల కాలేని ఐదు సెక్షన్ల కింద రౌడీ వినోద్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. పూందమల్లిలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో రెండున్నరేళ్లకు పైగా చేపట్టిన విచారణ పూర్తైంది. బుధవారం భారీ బందోబస్తు మధ్య వినోద్‌ను కోర్టులో హాజరుపరచగా, అతడికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది.

నుంగంబాక్కం ఈడీ కార్యాలయానికి పారా మిలటరీ భద్రత

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయానికి పారా మిలటరీ బలగాలతో ప్రత్యేక భద్రత ఏర్పాటైంది. డ్రగ్స్ వినియోగం కేసులో సంబంధాలున్న సినీ నటులు, అవినీతి కేసుల్లో చిక్కుకున్న రాజకీయ నాయకులు విచారణకు హాజరయ్యేందుకు ఈ కార్యాలయానికి వస్తుంటారు. ఈ ప్రాంగణంలో ఇప్పటివరకు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్న నేపథ్యంలో, ఇటీవల కాలంలో బాంబు బెదిరింపులు అధికంగా వస్తుండటంతో భద్రత కట్టుదిట్టం చేశారు. బుధవారం నుండి పారా మిలటరీ బలగాలతో 24 గంటల బందోబస్తు ఏర్పాటుచేసినట్టు అధికారులు తెలిపారు.

17న వన్నియార్ల రిజర్వేషన్ కోసం జైల్‌భరో

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వన్నియార్లకు 15శాతం రిజర్వేషన్ కోరుతూ డిసెంబరు 17న జైల్‌భరో నిర్వహించనున్నట్లు పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ప్రకటించారు. ఈస్ట్‌కోస్ట్ రోడ్డు అక్కరైలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం జరిగిన పీఎంకే ప్రధాన నేతల సమావేశంలో అన్బుమణి మాట్లాడుతూ రోగులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో డాక్టరైన తాను ఊహించని విధంగా రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజలకు సేవ చేస్తున్నట్లు తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మామిడి పండు గుర్తుతో పోటీ చేసి అధిక నియోజకవర్గాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఇలాంటి సమావేశాలు నిర్వహించి పార్టీశ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నట్లు తెలిపారు వన్నియార్లకు 15శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో డిసెంబరు 17న 234 నియోజకవర్గాల్లో జైల్‌భరో చేపట్టి లక్షలాది మంది కార్యకర్తలతో జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు అన్బుమణి తెలిపారు.

కోవై, నామక్కల్, రామనాథపురం జిల్లాలకు కేంద్ర అవార్డులు

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యంలో ఉత్తమ సేవలందించిన కోవై, నామక్కల్, రామనాథపురం జిల్లాలకు కేంద్ర అవార్డులు దక్కాయి. రాష్ట్రప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో, నీటి సంరక్షణ, ప్రజల భాగస్వామ్యం 1.0 ముందు చూపు చర్యలు చేపట్టే రాష్ట్రాలను ఎంపిక చేసి కేంద్రప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ప్రతి ఏటా అవార్డులు ప్రదానం చేసి సత్కరించడం ఆనవాయితీ. ఆ రీతిలో ఈ ఏడాదికి సంబంధించిన జాతీయ అవార్డులను కోవై, నామక్కల్, రామనాథపురం జిల్లాల కలెక్టర్లు ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు.

కోర్టు ధిక్కరణ కేసులో కళాశాల విద్యా డైరెక్టర్‌కు వారెంట్

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేయలేదనే కోర్టు ధిక్కరణ కేసులో కళాశాల విద్య డైరెక్టర్‌ను హాజరుపరచాలంటూ మద్రాసు హైకోర్టు వారెంట్ జారీచేసింది. కన్నియాకుమారి జిల్లా మార్తాండంలోని నేశమణి స్మారక క్రైస్తవ కళాశాల ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన పద్మజ నియామకానికి అంగీకారం తెలుపుతూ, తగిన ఉద్యోగ ఫలాలు అందించాలంటూ రాష్ట్ర కళాశాల విద్యా డైరెక్టరేట్, తిరునల్వేలి మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌కు 2022 ఫిబ్రవరిలో మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. న్యాయస్థానం ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా నాలుగు వారాల్లో ఉత్తర్వులు అమలుచేయలేదంటూ పిటిషనర్ పద్మజ 2022 డిసెంబరులో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కార్తికేయన్, కళాశాల విద్య డైరెక్టర్ ఈశ్వరమూర్తి, మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సాక్రటీస్ తదితరులపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసులో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించినా, కళాశాల విద్య డైరెక్టర్ హాజరుకాలేదు. ఈ కారణంగా, కళాశాల విద్య డైరెక్టర్ ఈ నెల 21వ తేది నేరుగా హాజరుపరిచేలా, బెయిలు మంజూరు కాని వారెంట్ జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 21వ తేదీకి వాయిదావేసింది.

ఫ్లైఓవర్ పిల్లర్ కింద చిక్కుకున్న బస్సు

● స్తంభించిన ట్రాఫిక్



ఫ్లైఓవర్ పిల్లర్ కింద ఇరుక్కున్న బస్సు

టి.నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు సెంట్రల్ బస్‌స్టేషన్ నుంచి ఉడుమల పేటకు 40 మంది ప్రయాణికులతో బయల్దేరిన బస్సు పల్లడం రహదారిలో ఫ్లై ఓవర్ కింద ఓ మలుపు వద్ద తిరుగుతూ స్లాబ్ క్రింద ఇరుక్కుపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ఆ బస్సు కదలలేదు. దీంతో ఆ ఫ్లైఓవర్‌కు ఇరువైపులా వాహనాలన్నీ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు భారీ క్రేన్ సహాయంతో స్లాబ్ కింద ఇరుక్కుపోయిన బస్సును వెలికితీశారు. ఆ తర్వాత ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. ఈ సంఘటన కారణంగా పాత బస్‌స్టేషన్ ప్రాంతం వద్ద సుమారు అరగంట సేపు ట్రాఫిక్ స్తంభించింది.

మోదీ... మా డాడీ

● అన్నాడీఎంకే మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వాన్ని నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ మా డాడీ అని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ పేర్కొన్నారు. విరుదునగర్ జిల్లా శివకాశి నియోజకవర్గ అన్నాడీఎంకే బూత్ ఏజెంట్ల శిక్షణ శిబిరాన్ని బుధవారం ఉదయం మాజీమంత్రి కేటీ రాజేంద్ర బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అది అన్నాడీఎంకే అధికారంలో ఉన్నప్పుడేనని, ఐదు రైల్వే వంతెనలకు శంకుస్థాపన చేసి రెండింటిని ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వంతో సన్నిహితంగా ఉంటేనే రాష్ట్రాల్లో అభివృద్ధి చూడగలమని, అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ అభివృద్ధిపై దృష్టిసారించడంలేదన్నారు. ప్రధాని మోదీని డాడీగా భావిస్తున్నామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-అన్నాడీఎంకేల కూటమి ఘన విజయం సాధిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తంచేశారు.

మంత్రుల నివాసాలకు బాంబు బెదిరింపు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరుచ్చిలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ నివాసాలు, కార్యాలయాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. నగరంలో డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఈ మెయిల్‌లో తిరుచ్చిలో ఉన్న నెహ్రూ, అన్బిల్ మహేష్ నివాసాల్లో బాంబులున్నాయని, అవి ఏ సమయంలోనైనా పేలతాయని ఉంది.. వెంటనే ఈ విషయాన్ని డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు తిరుచ్చి నగర పోలీసులకు తెలిపారు. తిరుచ్చి పోలీసులు హుటాహుటిన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో థిల్లైనగర్‌లో ఉన్న మంత్రి కేఎన్ నెహ్రూ నివాసం, శాస్త్రినగర్ వద్దనున్న ఆయన కార్యాలయం, తెన్నూరు అన్నానగర్‌లో ఉన్న మంత్రి అన్బిల్ మహేష్ నివాసం, సత్తిరం వీఎస్ నగర్ ప్రాంతంలోని ఆయన కార్యాలయాన్ని మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చివరకు అదంతా ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని నిర్ధారణ అయ్యింది. అదేవిధంగా నగరంలోని మంత్రి శేఖర్‌బాబు నివాసం, నటి రమ్యకృష్ణ, గాయని చిన్మయి నివాసాలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇదే విధంగా తిరుచ్చి సత్తిరం ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు కాలేజీకి కూడా బాంబు బెదిరింపు వచ్చింది. పోలీసులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో వెళ్ళి తనిఖీలు చేసి ఎక్కడా బాంబులు పెట్టిన దాఖలాలు లేవని ప్రకటించారు.

వరద ప్రవాహ మృతులకు నివాళి



స్థూపం వద్ద అంజలి ఘటిస్తున్న ప్రజలు

వేలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వాణియంబాడిలో 1903వ సంవత్సరంలో పాలారు నదీ ప్రవాహంలో మృతిచెందిన 200 మంది మృతులకు బుధవారం ఉదయం ఆ ప్రాంత ప్రజలు నివాళులర్పించారు. 1903 నవంబరు 12న కర్ణాటక రాష్ట్రంలోని నందిహిల్స్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు పాలారు నదికి వరద వచ్చి నీరు ఊళ్లలోకి ప్రవేశించింది. దీనితో సరిహద్దు ప్రాంతమైన వాణియంబాడిలో కూడా ప్రవాహం అధికమై జనావాసాల్లోకి చేరింది. ప్రవాహంలో కొట్టుకుపోయి సుమారు 200 మంది మృతిచెందారు. వారి జ్ఞాపకార్థం వాణియంబాడిలో పాలారు మృతుల స్మరణ స్థూపాన్ని ఏర్పాటు చేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తిరుపత్తూరు జిల్లా కలెక్టర్ శివసౌందర్యవల్లి, ఉమాబాయ్ శివాజీగణేశన్, స్థానిక ప్రజలు పాల్గొని పూలు చల్లి నివాళులర్పించారు.

కేసు విచారణకు హాజరైన మంత్రి చెళియన్



కోర్టు ప్రాంగణంలో మంత్రి చెళియన్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ మంత్రి సహా 9 మంది తంజావూరు కోర్టుకు హాజరయ్యారు. తూత్తుకుడిలో 2018 మే 22వ తేదీన జరిగిన కాల్పుల ఘటనలో పలువురు మృతిచెందారు. ఈ ఘటనను ఖండిస్తూ తిరువిడైమరుదూర్‌లో 2018 మే 24వ తేది మాజీ ఎంపీ సి.రామలింగం నేతృత్వంలో, అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్ సహా వందలాది మంది ఆందోళన చేపట్టారు. అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారంటూ సి.రామలింగం, కోవి.చెళియన్, యూనియన్ కార్యదర్శి అన్నాదురై జయపాల్, ఇళంగోవన్, పంచదానస్ సహా 9 మందిపై కేసు నమోదుచేశారు. ఈ కేసు తిరువిడైమరుదూర్ కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో, ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారిస్తున్న తంజావూరు ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేశారు. ఈ కేసు విచారణకు బుధవారం మంత్రి సహా అందరూ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 25వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కారు అద్దం లోపల పాము...!



అద్దంలో నుంచి వస్తున్న పాము

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కారు అద్దం లోపల దాగిన పామును బంధించి, సమీపంలో వదిలిపెట్టారు. నామక్కల్-సేల రోడ్డుపై మంగళవారం సాయంత్రం భార్యాభర్తలు కారులో వెళ్తున్నారు. పుదుసత్రం సమీపంలో కారు వెళ్తున్న సమయంలో, కారు సైడ్ మిర్రర నుంచి కొంబెరి జాతికి చెందిన పాము బయటకు రావడం గమనించిన భార్యాభర్తలు దిగ్భ్రాంతి చెందారు. వారు వెంటనే కారు ఆపి, అద్దం నుంచి ఆ పాము వేలాడుతున్న దృశ్యాలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అనంతరం చుట్టుపక్కల వారు పామును బంధించి సమీపంలో చెట్ల మధ్య వదిలిపెట్టారు.

ఇంజిన్ నుంచి పొగలు వచ్చి కారు దగ్ధం



దగ్ధమైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

తిరుత్తణి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పార్కింగ్ చేసిన కారు ఇంజన్ నుండి పొగలు రావడంతో 80శాతం కారు దగ్ధమైంది. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ క్లీనింగ్ సర్వీస్ యూనిట్‌లో దినేష్ అనే వ్యక్తి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం దినేష్ ఇంటివద్ద అతడి డ్రైవర్ అజిత్ కారు పార్కింగ్ చేశాడు. సాయంత్రం తిరిగి కారును స్టార్ట్ చేయగా, హఠాత్తుగా కారు ఇంజన్‌నుండి పొగలు వచ్చాయి. దీంతో అజిత్ కారునుండి దూరంగా వెళ్లి దినేష్‌కు సమాచారం అందించారు. దినేష్ కారు దగ్గరకు వచ్చేలోగా కారు మొత్తం మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహాయంలో మంటలను అదుపుచేశారు. అయినప్పటికీ కారు 80శాతం మంటలో కాలిపోయింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

లేడీ ఓరియంటెడ్ మూవీ 'ఎల్లో'

● ఆడియో రిలీజ్

నూతన దర్శకుడు హరి మహాదేవన్ డైరెక్షన్‌లో కోవై ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై ప్రశాంత రంగస్వామి నిర్మాణంలో 'ఎల్లో' పేరుతో లేడి ఓరియంటెడ్ మూవీ రూపొందించారు. వైభవ్, పూర్ణిమ రవి ప్రధాన పాత్రలు పోషించారు. మహిళా నేపథ్యంలో పక్కా కమర్షియల్ డ్రామాగా రూపొందించిన ఈ చిత్రం 21న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఆడియో రిలీజ్ చేసి మీడియాతో ముచ్చటించింది. హీరో వైభవ్ మాట్లాడుతూ, 'కథానాయకుడిగా ఇది నాకు తొలి చిత్రం. అనేక అడ్డంకులను అధిగమించి నిర్మాత ఈ చిత్ర నిర్మాణం పూర్తి చేశారు. ఇది ఒక ట్రావెల్ మూవీ. సీనియర్


'ఎల్లో' చిత్ర బృందం

దర్శకుడు ప్రభు సాల్మన్ మా విజ్ఞప్తి మేరకు చిన్న పాత్రలో నటించారు. ఆయనకు ధన్యవాదాలన్నారు. చిత్ర దర్శకుడు హరి మహాదేవన్ మాట్లాడుతూ, 'నేను చెప్పిన ప్రతి విషయాన్ని అర్థం చేసుకుని బలంగా నమ్మిన నిర్మాత ప్రశాంత్‌కు ధన్యవాదాలు. ఆ తర్వాత స్క్రిప్టు ఆయన చేతికిచ్చాను. దాన్ని పూర్తిగా చదివిన తర్వాత నేను ఊహించినదానికంటే ఎక్కువ ఆనందపడ్డారు. సీనియర్ నటుడు ఢిల్లీ గణేష్ ఈ చిత్రంలో ఒక పాత్ర చేయడం మాకు గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించాం. మీడియాతో పాటు ప్రేక్షకులు ఆదరించాలి. ఆశీర్వదించాలి' అని కోరారు. హీరోయిన్ పూర్ణిమ మాట్లాడుతూ, 'సాధారణంగా ఒక చిత్రం విజయం సాధిస్తే కొత్త అవకాశాలతో పాటు అనుభవం కూడా వస్తుంది. కానీ, ఈ చిత్రం మా అందరికి అనేక గుణపాఠాలు నేర్పింది. పలు విషయాలను నేర్చుకున్నాం. మా కోసం అవకాశాలు సృష్టించుకుని నటించాం. మా బృందాన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. మా అభ్యున్నతిలో నిర్మాత ప్రశాంత్‌కు భాగస్వామ్యం ఉంది. మా చిత్రాన్ని మీడియా మిత్రులు చూసి మంచి రివ్యూలు ఇవ్వాలని కోరుతున్నాను' అని కోరారు.


'ఐపీఎల్' ఆడియో రిలీజ్ కార్యక్రమంలో చిత్ర బృందం

28న 'ఐపీఎల్' విడుదల

టీటీఎఫ్ వాసన్ - కిషోర్ ప్రధానపాత్రల్లో నటించిన 'ఐపీఎల్' (ఇండియన్ పీనల్ లా) చిత్రం రాధా ఫిలిమ్స్ పతాకంపై జీఆర్ మదన్ నిర్మాణంలో కరుణానిధి దర్శకత్వంలో తెరకెక్కింది. అభిరామి, కుషిత, సింగంపులి, హరిష్ పేరడి, నరేన్, జాన్ విజయ్, బోస్ వెంకట్, దిలీపన్, జనని తదితరులు నటించారు. ఈ నెల 28వ తేదీన విడుదలకానుండగా చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం తాజాగా నగరంలో నిర్వహించారు. ఇందులో సినీ ప్రముఖులు ఆర్కే సెల్వమణి, ఆర్వీ ఉదయకుమార్, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్, నటుడు, దర్శకుడు బోస్ వెంకట్ తదితరులతోపాటు చిత్ర బృందం పాల్గొన్నారు. ఆడియో రిలీజ్ సందర్భంగా చిత్ర దర్శకుడు కరుణానిధి మాట్లాడుతూ, 'ఐపీఎల్... ఇండియన్ పీనల్ లా... ఒక సాధారణ వ్యక్తి సంతోషంగా జీవిస్తున్న సమయంలో అధికారం, ధన బలం కలిగిన వారికి ఏదైనా సమస్య ఉత్పన్నమైతే దాన్ని ఆ సాధారణ వ్యక్తులపై నెట్టి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి వాటి వలన సామాన్యుడి జీవితం ఎలాంటి కష్టాలను ఎదుర్కొంటుందన్నదే ఈ చిత్ర కథ. హీరో టీటీఎఫ్ వాసన్ మాట్లాడుతూ, 'ఇది నాకు తొలి చిత్రం. ఈ అవకాశాన్ని ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ఆ తర్వాత చిత్ర బృందం సభ్యులు, అతిథులు ప్రసంగించారు.

చిత్రజ్యోతి

లాభనష్టాల్లో అగ్రనటులు భాగస్వాములు కావాలి

● తమిళ చిత్ర నిర్మాతల మండలిలో తీర్మానం

నిర్మాతల లాభ నష్టాల్లో అగ్ర నటులు పాలు పంచుకోవాలని తమిళ చిత్ర నిర్మాతల మండలి తీర్మానం చేసింది. ఆ మండలి 2025 సంవత్సర సర్వసభ్య సమావేశం నగరంలో మంగళవారం అధ్యక్షుడు ఎన్.మురళి నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశంలో అనేక తీర్మానాలను చేశారు. తమిళ చిత్రపరిశ్రమకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు వెబ్ సిరీస్‌లకు పనిచేసేందుకు అమితాసక్తి చూపుతున్నారు. దీని కారణంగా సినిమాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇలాంటి వారికి చిత్రాల్లో నటించే అవకాశాలు కల్పించకూడదని తీర్మానం చేశారు. ఈ వెబ్ సిరీస్‌ల కారణంగా శాటిలైట్, ఓటీటీ బిజినెస్ గణనీయంగా తగ్గిపోతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నటుడు, టెక్నీషియన్ రెవెన్యూ షేర్ విధానంలో అంటే సినిమా లాభనష్టాల్లో పాలుపంచుకోవాలి.


మీడియా సమావేశంలో ఎన్.మురళి, తమిళ్ కుమరన్ తదితరులు

ఈ తరహా విధానం ఇప్పటికే ఇతర చిత్రపరిశ్రమల్లో అమలవుతుందని, ఇకపై కోలీవుడ్ లోనూ అమలు చేయాలని తీర్మానం చేశారు. ఆన్‌లైన్ టిక్కెట్ బుక్కింగ్ ప్రభుత్వమే నిర్వహించాలి. మూవీ రివ్యూల పేరుతో హద్దులు మీరి ప్రవర్తిస్తున్న యూట్యూబ్ చానళ్లపై సినీ అనుబంధ సంస్థలతో కలిసి న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని, అగ్ర హీరోల చిత్రాలు 8 వారాలు, ద్వితీయ శ్రేణి హీరోల చిత్రాలు 6 వారాలు, చిన్నబడ్జెట్ చిత్రాలు 4 వారాల తర్వాత ఓటీటీల్లో రిలీజ్ చేయాలని, 2026-29 సంవత్సరానికిగాను ఎన్నికలు డిసెంబరు నెలలో నిర్వహించాలని తదితర తీర్మానాలు చేశారు.

13న తోట తరణికి 'చెవాలియర్' అవార్డు

దక్షిణ భారత చలనచిత్రపరిశ్రమలో సీనియర్ కళా దర్శకుడు తోట తరణికి ఫ్రాన్స్ దేశ కళలు, సాంస్కృతిక విభాగం 'చెవాలియర్' అవార్డు ప్రకటించారు. దీన్ని ఈ నెల 13వ తేదీ నగరంలో జరిగే ఓ కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి ఈ అవార్డును తోట తరణికి అందజేస్తారు. అదే రోజు తోట తరణి కళా ఖండాల ప్రదర్శన ఏర్పాటుచేయనున్నారు. గతంలో ఈ పురస్కారం తమిళ చిత్రపరిశ్రమలో దివంగత నడిగర్ తిలగం శివాజీ గణేశన్, అగ్ర నటుడు కమల్ హాసన్‌లకు మాత్రమే వరించిన విషయం తెల్సిందే.


తోట తరణి

'ఏమ్మా.....సరుకుల ధరలు తగ్గాయా...?'

● మహిళలను ప్రశ్నించిన కేంద్రమంత్రి


సూపర్ మార్కెట్లో మహిళను పలుకరిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ శ్లాబు విధానంలో చేపట్టిన సవరణలతో పలు వస్తువుల ధరలు తగ్గాయి. ఈ క్రమంలో, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం కోయంబత్తూర్ వచ్చారు. కోవై సోమనూరు, కురుంపాళయం తదితర ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారులను కలిసి పన్ను తగ్గింపుపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, దుకాణాలకు వెళ్లి సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలను పలకరించి, ధరలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా, జీఎస్టీ తగ్గింపుతో వస్తువుల ధరలు తగ్గాయా? అంటూ మహిళలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు.

విమానాశ్రయంలో ఉగ్రవాద నిరోధక 'మాక్ డ్రిల్'


మాక్ డ్రిల్ దృశ్యం

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో ఉగ్రవాద నిరోధక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఢిల్లీలో సోమవారం జరిగిన బాంబు పేలుడు ఘటన దేశప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా రద్దీ ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశారు. ఈ క్రమంలో, మీనంబాక్కం విమానాశ్రయంలో సాధారణంగా మూడెంచెల భద్రత అమలులో ఉండగా, సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఐదెంచెల భద్రత చేపట్టారు. విమాన ప్రయాణికుల లగేజీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే, ప్రయాణికులు కత్తెర, రేజర్ బ్లేడ్లు, అల్లిక సూదులు, తాడు, ఇన్సులేషన్ టేప్, వాకింగ్ స్టిక్స్, గొడ్డళ్లు, ఊరగాయ సీసాలు వంటి వాటిపై నిషేధం విధించారు. ఈ క్రమంలో, విమానాశ్రయంలో ప్రయాణికులు సాధారంగా వెళ్తున్న సమయంలో, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు హఠాత్తుగా ఉగ్రవాదులు లోనికి ప్రవేశించడం, ఉగ్రవాదులను భద్రతా దళాలను అరెస్ట్ చేయడం తదితరాలు చేశారు. ఉగ్రవాద దాడులపై ప్రయాణికులకు అవగాహన కల్పించేలా ఈ మాక్ డ్రిల్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

మినీ బస్సు సర్వీసు ప్రారంభం


మినీ బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న మంత్రి నాజర్

తిరువళ్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా చోళంబేడు, గణపతి నగర్ బస్టాండ్ పరిధిలో మినీ బస్సు సర్వీసును రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి నాజర్ బుధవారం ఉదయం ప్రారంభించారు. చోళంబేడు పరిధిలో బుధవారం మంత్రి నాజర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన చోళంబేడు ప్రధానరోడ్డులోని గణపతి నగర్ బస్టాండును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా డీఎంకే ప్రభుత్వం పనిచేస్తుందని వ్యాఖ్యానించారు.

తిరుముల్లైవాయల్‌లోని అరాఫత్ చెరువు మరమ్మతు పనులను రూ.2 కోట్లతో చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు పార్లమెంట్ సభ్యులు శశికాంత్ సెంథిల్, జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి కార్పొరేషన్ కమిషనర్ శరణ్య, మేయర్ ఉదయకుమార్‌తో పాటు పలువురు అధికారులు, డీఎంకే పార్టీ నాయకులు పాల్గొన్నారు.

9 ప్రాంతాల్లో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ నగరంలో 9 ప్రాంతాల్లో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయనుంది. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ఈ వాహనాలకు తమ ఇళ్లలో ఛార్జింగ్ చేసుకుంటున్న నేపథ్యంలో, బయటకు వెళ్లిన సమయంలో ఛార్జింగ్ అయిపోయి పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, నగరంలో బీచ్‌లు, పార్కులు, ప్రజలు అధికంగా సంచరించే 9 ప్రాంతాల్లో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఈ కేంద్రాల్లో ద్విచక్రవాహనాలు, మూడు, నాలుగు చక్రాల వాహనాలు సహా అన్నిరకాల వాహనాలు ఛార్జింగ్ చేసే సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఐదోసారి కోవలం బీచ్‌కు 'బ్లూ ఫ్లాగ్' సర్టిఫికెట్



పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోవలం బీచ్ వరుసగా ఐదోసారి 'బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్' లభించింది. పర్యావరణ విద్యా ట్రస్ట్, డెన్మార్క్ నిర్దేశించిన ప్రపంచ ప్రమాణాలు అందుకుని కోవలం బీచ్ ఐదవసారి బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్‌కు ఎంపికైందని బ్లూ బాక్ ఇండియా నేషనల్ ఆర్గనైజర్ చెంగల్పట్టు జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. బ్లూ ఫ్లాగ్ అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పర్యావరణ నియమావళి. నీటి నాణ్యత, పర్యావరణ విద్య, భద్రత, పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, బీచ్‌లో మౌలిక సదుపాయాలు సహా నిబంధనలు పూర్తిచేసే బీచ్‌లకు ఈ సర్టిఫికెట్ ఇస్తుంటారు. జాతీయ, అంతర్జాతీయ కమిటీల పరిశీలన అనంతరం ప్రతి ఏడాది ఈ సర్టిఫికెట్ పునరుద్ధరిస్తుంటారు. కోవలం బీచ్ 2021 సెప్టెంబరు 21న తొలిసారి ఈ సర్టిఫికెట్ అందుకుంది. ఈ ఏడాది నిర్వహించిన సమగ్ర అంచనా ఆధారంగా, 2025-26వ సంవత్సరానికి కోవలం బీచ్ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ గౌరవం నిలుపుకుంది. బీచ్‌లో పర్యాటకులకు సౌకర్యంగా వెదురు పెవిలియన్లు, లాంజ్ కుర్చీలు. దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్లు, తేలియాడే క్వాడ్ బైక్‌లు అందుబాటులో ఉంటాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ పొందిన లైఫ్‌గార్డ్‌లు, నిఘా వ్యవస్థల ద్వారా పర్యాటకుల భద్రత నిర్ధారిస్తుంటారు. 2024-25లో ఈ బీచ్‌ను 5.5 లక్షల మంది సందర్శించారు. ఇక, రాష్ట్రంలో పలు బీచ్‌లకు ఈ సర్టిఫికెట్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విషయమై పర్యావరణం, వాతావరణ మార్పులు, అటవీ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు మాట్లాడుతూ... ప్రపంచస్థాయిలో సర్టిఫికెట్ పొందేందుకు రాష్ట్రంలోని 10 బీచ్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. అందులో చెన్నైలో నాలుగు బీచ్‌లు, కడలూరులో రెండు, విల్లుపురం, నాగపట్టణం, రామనాథపురం, తూత్తుకుడిలో తలా ఒక బీచ్ ఎంపిక చేశామన్నారు. కోవలం బీచ్ వరుసగా ఐదో సారి బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వ కృషి, స్థానిక ప్రజల సహకారం ఎంతో ఉందని సుప్రియా సాహు తెలిపారు.

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో సంభవించిన బాంబు పేలుడు ఘటన సందర్భంగా రామేశ్వరం సమీపంలోని పాంబన్ వంతెన వద్ద సాయుధ పోలీసుల పహారా



వీఎస్ హాస్పిటల్స్‌లో 'హోప్' విభాగం ప్రారంభం


హోప్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ సినీ నటి రోహిణి, వీఎస్ హాస్పిటల్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సుబ్రమణియన్, వైద్యనిపుణులు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రఖ్యాత క్యాన్సర్ సంరక్షణ చికిత్సా కేంద్రం వీఎస్ హాస్పిటల్స్ 'హోప్' (హోలిస్టిక్ అంకాలజీ ప్రోగ్రామ్ ఫర్ ఎక్సలెన్స్) ప్రత్యేక విభాగాన్ని బుధవారం ప్రారంభించింది. ప్రముఖ సినీ నటి రోహిణి మొల్లేటి ఈ విభాగం లోగో ఆవిష్కరించి ప్రారంభించారు.. వీఎస్ హాస్పిటల్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.సుబ్రమణియన్ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులు ఆ రోగం నుండి బయటపడేందుకు అనువైన ఆహారపు అలవాట్లను కృత్రిమ మేథోపరిజ్ఞానం (ఏఐ) ద్వారా అందించేందుకు అమెరికాకు చెందిన ట్వీక్ అండ్ ఈట్ సంస్థతో అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ హాస్పిటల్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ నిత్యా శ్రీధరన్, అడల్ట్ అండ్ పీడియాట్రిక్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ విజయ్, డాక్టర్ ఎస్.సుందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ముత్తు సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

పురుషుల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం


అవగాహనా కార్యక్రమంలో వైద్య నిపుణులు

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 'ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ' (ఏఐఎన్‌యూ) ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం పురుషుల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్, వృషణ క్యాన్సర్‌కు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఇప్పటికీ నివారణ వైద్యంలో తక్కువగా చర్చించబడిన రంగాల్లో పురుషుల ఆరోగ్యం ఒకటిగా వుందన్నారు. 20- 30 ఏళ్లలోపు యువకులు సంతానోత్పత్తి, లైంగిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గమనిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అవగాహన పెంచుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట సుబ్రమణ్యం తదితరులు కూడా పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి కంప్యూటర్ తమిళం' పురస్కారం

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి కంప్యూటర్ తమిళం' పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... సమాచార సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి అనుగుణంగా, కంప్యూటర్ తమిళం అభివృద్ధికి, ఉత్తమ తమిళ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం, తద్వారా తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడం వంటి సేవా కార్యక్రమా చేపట్టే వారిని ప్రోత్సహించేలా, తమిళ అభివృద్ధి శాఖ తరఫున 'ముఖ్యమంత్రి కంప్యూటర్ తమిళం' పురస్కారం 2013వ సంవత్సరం నుంచి ప్రదానం చేస్తున్నారు. పురస్కార గ్రహీతలకు రూ.2 లక్షల నగదు, సవర బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేస్తుంటారు. 2025వ సంవత్సరానికి ఈ పురస్కారానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు, దరఖాస్తు సమర్పణకు www.tamilvalarchithurai.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని తమిళ అభివృద్ధి శాఖ ప్రకటనలో తెలిపింది.

యాంత్రిక లోపంతో ఆగిన శ్రీలంక విమానం

● 12 గంటలపాటు ప్రయాణికుల పడిగాపులు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో శ్రీలంక రాజధాని కొలంబోకు బయలుదేరాల్సి శ్రీలంక ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఆ లోపాన్ని సరిచేయడానికి ఇంజనీరింగ్ నిపుణులు గంటల తరబడి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు 12 గంటల ఆలస్యంగా శ్రీలంక నుంచి తెప్పించిన మరో విమానంలో ప్రయాణికులు వెళ్లాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం 9.45 గంటలకు 252 మంది ప్రయాణికులు, 10 మంది విమాన సిబ్బందితో ఆ విమానం రన్‌వేపై టేకాఫ్ అవుతున్న సమయంలో సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన పైలెట్ కంట్రోల్ రూం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పుల్లింగ్ వెహికల్ ద్వారా ఆ విమానాన్ని రన్‌వే పాయింట్ దగ్గరకు చేర్చి ప్రయాణికులందరిని దింపివేశారు. సాంకేతిక లోపం సరిదిద్దిన తర్వాత ప్రయాణికులకు కబురు చేస్తామని అంతవరకూ విమానాశ్రయంలోనే ఉండాలని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. అయితే రాత్రి 7.30 గంటల దాటినా విమానంలో సాంకేతిక లోపాన్ని సాంకేతిక విభాగం నిపుణులు చక్కదిద్దలేకపోయారు. చివరకు రాత్రి 7.30 గంటలకు శ్రీలంక నుండి తెప్పించిన విమానంలో 252 మంది ప్రయాణికులు కొలంబో బయలుదేరారు.

తంజావూరులో పంచలోహ విగ్రహం లభ్యం



అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో అడుగు ఎత్తున్న పంచలోహ విగ్రహం లభ్యమైంది. పందకుళానికి చెందిన శరణ్య తన ఇంటి ప్రాంగణంలో డ్రైనేజీ నిర్మించేందుకు గుంతను తవ్విస్తుండగా విగ్రహం కనిపించింది. ఆరు కిలోల బరువైన విగ్రహంలో మీనాక్షి అమ్మవారి భుజంపై చిలుక కూర్చొని ఉంది. శరణ్య ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేసింది. అధికారులు అక్కడకు చేరుకుని విగ్రహం స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయంలో భద్రపరిచారు. పురావస్తు పరిశోధకుల పరిశీలన అనంతరం విగ్రహం ఏ కాలానికి చెందినదో తెలుస్తుందని అధికారులు తెలిపారు.

నగరంలో 2 చోట్ల ఐటీ తనిఖీలు

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఈంజంబాక్కం వెట్టువాంకేణిలో నివసిస్తున్న డాక్టర్ సాముయేల్ గాడ్విన్ నివాసంలో బుధవారం ఉదయం ఐటీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ సాముయేల్ గాడ్విన్ మధుమేహ చికిత్సలో ఖ్యాతిగడించిన వైద్యనిపుణుడిగా పేరుతెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ వైద్యుడి నివాసంలోనూ అదే ప్రాంతంలో నివసిస్తున్న శర్వానంద్ నివాసంలోనే ఒకే సమయంలో పది మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. వీరిద్దరూ భారీ స్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు రావటంతో ఈ తనిఖీలు జరిపినట్లు ఐటీ అధికారులు పేర్కొన్నారు.

నరసాపూర్ వరకు చెన్నై-విజయవాడ వందే భారత్

అడయార్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై-విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైలును నరసాపూర్ వరకు పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 5.30 గంటలకు బయల్దేరే వందే భారత్ రైలు 11.45 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ రైలు జనవరి 12 నుంచి నరసాపూర్ వరకు పొడిగించారు. ఆ ప్రకారం, మధ్యాహ్నం 12.29 గంటలకు గుడివాడ, 1.14 గంటలకు భీమవరం, 2.10 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో, నరసాపూర్ నుంచి మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

ఒకే నౌకలో 103 విండ్ టర్బైన్ల దిగుమతి

● రికార్డు సృష్టించిన వావూసీ హార్బర్

పెరంబూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి వావూసీ హార్బర్‌లో ఒకే నౌకలో వచ్చిన 103 విండ్ టర్బైన్లు దిగుమతి చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. హార్బర్ చరిత్రలో ఇంత పెద్దసంఖ్యలో టర్బైన్లు దిగుమతి చేసుకోవడం ఇదే తొలిసారి. చైనాలోని కిన్‌సోప్ హార్బర్ నుంచి 'ఎంటీజీహెచ్‌టీ మరినాస్' నౌక ద్వారా ఈ టర్బైన్లు దిగుమతి చేసుకున్నట్లు హార్బర్ అధికారులు తెలిపారు.


నౌకలో వచ్చిన 103 విండ్ టర్బైన్లు

మంచు కురిసే వేళలో...

● ఊటీ, కున్నూరులో ఆహ్లాదకరం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో గత వారం రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురవటంతో ఆ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ఊటీ, కున్నూరులో చల్లటి వాతావరణం నెలకొంది. దీనికి తోడు రాత్రి పూట దట్టమైన మంచు ఈ రెండు ప్రాంతాలను కప్పేయడంతో ప్రజలు చలికి తీవ్రంగా వణికిపోతున్నారు. వేకువజాము రెండు గంటల నుండి ఉదయం ఎనిమిది గంటల వరకు, సాయంత్రం ఐదు నుండి రాత్రి 9 గంటల వరకు మంచు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం ఉదయం ఊటీ రహదారుల్లో అరగంటసేపు మంచు వర్షం కురియడంతో వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. ఊటీ, లవ్‌డేల్, ఫెర్న్‌హిల్, బొటానికల్ పార్కు, దొడ్డబెట్టా ప్రాంతాలపై దట్టమైన మంచు అలముకుంది. దీంతో ఈ ప్రాంతాలకు వచ్చిన పర్యాటకులంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇదే విధంగా కున్నూరులో మంగళవారం రాత్రి నుండి బుధవారం వేకువజాము వరకు ఓ మోస్తరుగా వర్షం కురవటంతో చల్లటి వాతావరణం నెలకొంది. చలిగాలులు సైతం వీయడంతో స్థానికులు ఇంటిపట్టునే గడుపుతున్నారు.


ఊటీలో కురుస్తున్న మంచులో లైట్లు వేసుకుని వెళుతున్న వాహనాలు

ఎస్వీబీసీకి ప్రత్యేకంగా అకౌంట్ ఆఫీసర్

● టీటీడీ ఈవో సింఘాల్

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ(శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్)లో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుంచి లేదా, అటానమస్ సంస్థ నుంచి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఎస్వీబీసీ ద్వారా మరింత నాణ్యమైన ప్రసారాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ ఇంచార్జీ సీఈవో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి గన్‌మెన్ కేటాయింపు

సత్యవేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి ప్రభుత్వం భద్రతను పెంచింది. శంకర్‌రెడ్డికి వన్ ప్లస్ వన్ గన్‌మన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో చురుకుగా తిరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్న శంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం గందరగోళ పరిస్థితులను సృష్టించే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వానికి సమాచారం అందడంతో భద్రత కారణాల దృష్ట్యా వన్ ప్లస్ వన్ గన్‌మన్ ఏర్పాటు చేసింది.


'కిష్కింధపురి' విజయంతో కొండకు వచ్చా!

● హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్



తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన 'కిష్కింధపురి' సినిమా విజయవంతం అయిన సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తన తదుపరి చిత్రం 'హైందవ'ను కూడా ఇదే స్థాయిలో ఆదరించి విజయాన్ని ఇవ్వాలని కోరుకున్నానన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 25 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,367

తలనీలాలు సమర్పించినవారు: 22,369

అటు కల్తీ నెయ్యి.. ఇటు పరకామణి

తిరుపతిలో ముమ్మరంగా టీటీడీ కేసుల విచారణ



విచారణ అనంతరం సిట్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ధర్మారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సంబంధించి కల్తీ నెయ్యి, పరకామణిలో చోరీ కేసులకు సంబంధించి తిరుపతిలో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. ఒకవైపు సీఐడీ.. మరోవైపు సీబీఐ భాగస్వామ్యమున్న సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది.

● తిరుపతిలోని టీటీడీ భూదేవి కాంప్లెక్సులో సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలోని సీబీఐ డీఎస్పీలు, సిట్ దర్యాప్తు అధికారి వెంకట్రావు ఇతర పోలీసు అధికారులు కల్తీ నెయ్యి కేసులో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్‌జైన్, విపిన్‌జైన్‌తో పాటు టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని మంగళ, బుధవారాల్లో విచారించారు. దీంతో ఇక్కడ కూడా హడావుడి నెలకొంది.

● మరోవైపు శ్రీ పద్మావతి అతిథి గృహం కేంద్రంగా వారం రోజులుగా పరకామణిలో జరిగిన చోరీ కేసును హైకోర్టు ఆదేశాల మేరకు ఏకంగా సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్, అతడి కుటుంబ సభ్యులను తొలుత విచారించారు. ఆ తర్వాత ఈ కేసు సమయంలో తిరుమలలో వన్‌టౌన్ సీఐగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, అప్పటి టూ టౌన్ సీఐ చంద్రశేఖర్, పరకామణి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావు, టీటీడీ సెక్యూరిటీ అధికారులు సుబ్బరాజు, రామచంద్ర, సీసీ కమాండ్ యూనిట్ గార్డు చంద్రతో పాటు జయచంద్రారెడ్డిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. దీంతో అధికారుల రాకపోకలు, విచారణ కోసం వస్తున్న వారితో పద్మావతి అతిథి గృహం సందడిగా మారింది.

● ఇంకోవైపు పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ విచారిస్తోంది. ఈ కేసు కూడా తిరుపతి కేంద్రంగా నడుస్తోంది. జరుగుతుంది.

◆ 'పరకామణి' కేసులో

టీడీపీ జోక్యం ఉండదు

● నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయండి ● సీఐడీ డీజీని కోరిన వర్ల రామయ్య



సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో మాట్లాడుతున్న వర్ల రామయ్య

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసుపై సీఐడీ జరుపుతున్న దర్యాప్తులో టీడీపీ జోక్యం ఉండదని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలంటూ ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్‌ను కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో ఆయన టీడీపీ నేతలతోపాటు సీఐడీ చీఫ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవారి పరకామణిలో ఎన్ని వందల కోట్లు కొట్టేశారో తెలియాల్సి వుందన్నారు. ఈ కేసును నెలలోనే లోక్ అదాలత్‌లో రాజీ చేయడం వెనుక ఎవరున్నదీ ప్రజలకు తెలియాల్సి వుందన్నారు. హైకోర్టు ఇచ్చిన సమయం చాలకపోతే ఇంకా వ్యవధి తీసుకుని వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. టీటీడీకి ఆస్తులను బదిలీ చేసిన సమయంలో స్టాంప్ డ్యూటీ ఎవరు చెల్లించారో తేల్చాలన్నారు. దీని వెనుక ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టవద్దని కోరారు. నిక్కచ్చిగా, నిర్భయంగా విచారణ చేయాలని అభ్యర్థించారు. పరకామణి చోరీ కేసు రాజీకి కర్త, కర్మ, క్రియ అంతా భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, ధనంజయరెడ్డిలేనని ఆరోపించారు. వారి కుటుంబీకులు, బంధువుల ఆస్తులు వెలికి తీయాలని, పరకామణి చోరీ నిధులతో ఆస్తులు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారో నిగ్గు తేల్చాలని కోరారు. దర్యాప్తులో తేల్చాల్సిన పలు సందేహాలకు సంబంధించి 27 అంశాలతో వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు శ్రీధర్ వర్మ, కుమారమ్మ, మహేష్ యాదవ్, సూరా సుధాకరరెడ్డి, రజనీకాంత్ నాయుడు, పాతకం వెంకటేష్, వట్టికుంట శంకర్ తదితరులున్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నుంచీ వినతి పత్రాన్ని తీసుకున్న సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్.. ఆ పత్రాన్ని హైకోర్టుకు అందజేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామన్నారు. లోతుగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. దేవుడి ఆస్తికి సంబంధించిన కేసు కాబట్టి నిర్భయంగా దర్యాప్తు చేస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

పల్లికొండేశ్వరాలయ సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యం

● ఛైర్మన్ పద్మనాభరాజు



నూతన పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద్మనాభరాజు ' చెప్పారు. బుధవారం ఆలయ సమావేశ మందిరంలో పాలక మండలి మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానంలో ఉన్న గోశాలలో 56 గోవుల సంరక్షణకు ఇద్దరు కార్మికులు సరిపోకపోవడంతో మరో కార్మికుడిని నియమించుకోవాలని తీర్మానించారు. నిత్యం స్వామిఅమ్మవార్ల అభిషేకాలు ప్రారంభయ్యే సమయానికి గోపూజ నిర్వహించాలని, నైవేద్యం భక్తులందరికీ అందేలా దిట్టం పెంచాలని తీర్మానించారు. మరో ఇద్దరు అర్చకులను, అటెండరు నియామకానికి దేవదాయ శాఖ ఆమోదానికి పంపాలని ఈవో లతను కోరారు. కారిడార్ మరమ్మతులు పూర్తి చేసి భక్తుల బసకు ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహకారంతో మరో 8 వసతి గృహాలు నెల రోజుల్లో పూర్తి చేస్తున్నామన్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లపై ముందస్తు చర్చలు వేశారు. ఉభయదారులకు ఉభయపైకం రూ.35 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కృష్ణయ్య, వెల్సన్ మండేలా హంస, దేవి, జయంతి, కవిత, నాగభూషణమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి





రంజిత్ నాయుడు, బాబురాజు

వడమాలపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి తడుకు ఆర్.ఎస్. వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందారు. విజయపురం మండలం కేవీపురానికి చెందిన రంజిత్ నాయుడు(52), ఎస్‌బీఆర్‌పురానికి చెందిన బాబురాజు అలియాస్ నరసింహరాజు (51) రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపుగా వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటినుంచి 'నృత్య వాహిని'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి 'నృత్య వాహిని' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ ఉమ తెలిపారు. బుధవారం ఆమె రిజిస్ట్రార్ రజని, కన్వీనర్లు వాణి, విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హిమబిందుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభిస్తారన్నారు. మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శీల శ్రీధర్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. 15వ తేదీ దాకా సాగే ఈ కార్యక్రమంలో 87 మంది దేశ, విదేశీ నృత్యకారులు అనేక నృత్య రీతులను ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ నృత్యాలపై మ్యూజిక్ అండ్ డ్యాన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు నేతృత్వంలో వర్క్‌షాప్ చేపడుతున్నామని తెలిపారు. సమాపనోత్సవం సందర్భంగా కళాకారులందరూ సామూహిక నృత్య ప్రదర్శన చేస్తారన్నారు.

చక్కెర కర్మాగారం వద్ద బారులు తీరిన వాహనాలు



చక్కెర కర్మాగారం బయట ఉన్న చెరకు లారీలు, ట్రాక్టర్లు

తిరుత్తణి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెరకు సక్రమంగా దిగుమతి చేసుకోలేదని అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరువలంగాడులోని తిరుత్తణి సహకార చక్కెర కర్మాగారంలో గత నెల 24 నుంచి క్రషింగ్ ప్రారంభించారు. ప్రతిరోజు 2,200 టన్నుల క్రషింగ్ జరుగుతోంది. కర్మాగారానికి చెరకు తరలించేందుకు రైతులు ఇదివరకే కటింగ్ పర్మిట్లు పొందారు. అద్దెకు లారీలను తీసుకొచ్చి చెరకు కర్మాగారానికి తరలిస్తున్నారు. కానీ లారీలను కర్మాగారంలోకి అనుమతించి, చెరకు దించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సుమారు 300లకు పైగా లారీలు కర్మాగారం చుట్టు పక్కల ప్రాంతాల్లో నిలిపిన రైతులు, కర్మాగారంలోకి ఎప్పుడు అనుమతిస్తారా అని వేచి ఉన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా కాలభైరవాష్టమి పూజలు

నగరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కాలభైరవ స్వామి ఆలయంలో అష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు పంచామృతం చందనం, పన్నీరు మొదలగు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయంలోకి సరుకులు చేర్చేందుకు

కొత్త 'బ్యాగ్ కన్వేయర్'





ప్రస్తుతం వినియోగంలో ఉన్న బ్యాగ్ కన్వేయర్ - నూతన బ్యాగ్ కన్వేయర్

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోకి ముడి సరుకులు చేర్చేందుకు నూతన బ్యాగ్ కన్వేయర్ (బ్యాగ్ స్టాగర్) అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా శ్రీవారికి సమర్పించే అన్నప్రసాదాలు, లడ్డూలు, వడలు, ఇతర ప్రసాదాలన్నీ సంప్రదాయం మేరకు శ్రీవారి ఆలయంలోని పోటు (కట్టెల పొయ్యితో కూడిన వంటశాల)లోనే తయారవుతాయి. ఈమేరకు నిత్యం దాదాపు 50 టన్నుల నుంచి 65 టన్నుల ముడిసరుకులను ఆలయంలోకి పంపాల్సి ఉంటుంది. మహద్వారం నుంచి ఈ సరుకులను తరలించడం అంటే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈక్రమంలో 35 ఏళ్లుగా ఆలయం వెనుకభాగంలో ఉన్న ఉగ్రాణం (ముడిసరుకుల నిల్వ ప్రదేశం) నుంచి టీటీడీ బ్యాగ్ కన్వేయర్ ద్వారా సరుకులను ఆలయంలోకి పంపుతున్నారు. అప్పట్లో చెన్నైకి చెందిన ఓ సంస్థ ఈ బ్యాగ్ కన్వేయర్‌ను విరాళంగా అందించింది. ప్రసాదాల తయారీకి కావాల్సిన సరుకులను చిన్నపాటి మూటలు కట్టి ఈ కన్వేయర్‌పై ఉంచితే దాదాపు 40 అడుగల ఎత్తులో ఉన్న ఆలయ ప్రాకారంపైకి చేరుతాయి. అక్కడి సిబ్బంది ఈ సరుకులను తీసుకుని ప్రసాదాల తయారీకి వినియోగిస్తారు. ఇది ప్రతిరోజు జరిగే ప్రక్రియ. అయితే దాదాపు 35 ఏళ్ల క్రితం నుంచి వినియోగిస్తున్న ఈ బ్యాగ్ కన్వేయర్ నిత్యం మరమ్మతులకు గురవుతోంది. అప్పటికప్పుడు మరమ్మతులు పూర్తిచేసి సిద్ధం చేసినప్పటికీ బ్యాగ్ కన్వేయర్ బాడీ పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కన్వేయర్ కింద నిత్యం భక్తులు కూడా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదనే ముందస్తు జాగ్రత్తగా టీటీడీ నూతన బ్యాగ్ కన్వేయర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఓ దాత సహకారంతో నాగ్‌పూర్ నుంచి నూతన బ్యాగ్ కన్వేయర్‌ను తిరుమలకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇందులోనే హైడ్రాలిక్, బాడీ వంటి వాటిని పరిశీలన చేస్తున్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో దీన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయండి

● మహిళా మోర్చాను బలోపేతం చేయండి

● కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని, మహిళా మోర్చాను బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన నిషిధారాజు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులిగా నియమితులైన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన వీరు పాల్గొన్నారు. ఉత్పత్తి రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచిన మేకిన్ ఇండియా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా పనిచేస్తే ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఉన్న దేశాన్ని అగ్రస్థానంలోకి తీసుకెళ్లొచ్చని, దీనికి ప్రజలు, పార్టీ శ్రేణులు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. నిషిధారాజు ఆధ్వర్యంలో మహిళామోర్చా మరింత బలోపేతమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం కూటమిపై ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తోందని ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధారాజును ఘనంగా సత్కరించి అభినందించారు. బీజేపీ నేతలు విష్ణుకుమార్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సామంచి శ్రీనివాస్, నాగలక్ష్మి, మాధవి, పార్వతి, యువశ్రీ, విజయలక్ష్మి, ఇతర నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

చట్టాలను రూపకల్పన చేసిన దార్శనికుడు మోదీ

● లా విద్యార్థులతో కేంద్ర మంత్రి

కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చి భారతీయ న్యాయ చట్టాలకు రూపకల్పన చేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్రమోదీ అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'స్వశక్త భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో ఆయన న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ చట్టాలను తీసుకురావడం సాధారణ విషయం కాదన్నారు. న్యాయ విద్యార్థులందరూ వీటిపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులను మన జీవితంలో భాగం చేసుకుని దేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థులతో పాటు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఉదయం తిరుపతిలో 'మన ఊరు- మన జెండా' కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరం పళణి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాధవ్ జెండా ఆవిష్కరించారు. పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పారు.



డైకిన్ పరిశ్రమలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాగృతి యాత్ర బృందానికి చెందిన 525 మంది సభ్యులు గురువారం బుధవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8 వేల కి.మీ పర్యటిస్తుంది. వివిధ రంగాల్లో ఆదర్శవంతులను(రోల్ మోడల్) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికుల్లో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి యాత్ర బృందానికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక కేంద్రం ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో భాగంగా యాత్రికులు శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక పురోగతిని నేరుగా వీక్షించడంతో పాటు పలు బ్యాచ్‌లుగా విడిపోయి డైకిన్, బ్లూస్టార్, లావాజ్జా ఈ ప్యాక్, పెప్సికో, అంబర్ రాక్‌వర్త్, బెర్గెన్ పైపు సపోర్ట్స్, ఏఎల్ఎఫ్, ఆర్ఎన్‌బీ ట్రాన్స్‌మిషన్, ఎంఎండీ, బ్రేక్స్ ఇండియా, డైకి అల్యూమినియం పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, వివిధ రకాల ఉత్పత్తుల వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ బృందానికి సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈవో అశుతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు, ఔత్సాహక పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు ఉన్న సంపూర్ణ వ్యాపార నగరానికి శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. 2016 నుంచి నేటి వరకు 8 పర్యాయాలు తమ బృందం శ్రీసిటీని సందర్శించిందని, ప్రతిసారి సభ్యులతో శ్రీసిటీ చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానించారు. పరిశ్రమల సందర్శన అనంతరం బుధవారం రాత్రి వారి రోల్ మోడల్‌గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జాగృతి సభ్యులతో సమావేశమవుతారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రయాణం, దార్శనికత, సవాళ్లు, మైలు రాళ్లను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేస్తారు.

నేటి నుంచి పంచగవ్య వైద్య మహా సమ్మేళనం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పంచగవ్య వైద్య మహాసమ్మేళనం జరగనున్నట్లు సిద్ధాచార్య నిరంజన్‌వర్మ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశ నలు మూలల నుంచి పంచగవ్య వైద్యశాస్త్రంపై పనిచేస్తునన శాస్త్రవేత్తలు, గవ్య ఉత్పత్తి నిర్వాహకులు, గోశాల నిర్వాహకులు, గోరక్షకులు సుమారు 1,200మంది ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కొత్త కొత్త విషయాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పంచగవ్య వైద్యశాస్త్ర విద్యను పూర్తిచేసిన 201మందికి అడ్వాన్స్ డిప్లొమా ఇన్ పంచగవ్య థెరపి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ప్రేమలత మూడో విడత పర్యటన

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఈ నెల 16 నుంచి మూడో విడత పర్యటన ప్రారంభించనున్నారు. ఈ పర్యటన మదురైలో ప్రారంభమై ఈరోడ్‌లో ముగియనుంది. 'ఉల్లమ్ తేడి... ఉల్లమ్ నాడి' పేరుతో గత ఆగస్టు 2న ఆమె తొలి విడత పర్యటన చేపట్టారు. ఇటీవలే రెండో విడత పర్యటన పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న మదురైలో మూడో విడత పర్యటనను ఆమె ప్రారంభించనున్నారు. 17 వరకు మదురైలోని నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఆ తర్వాత 18, 19 తేదీల్లో దిండుగల్‌లో, 20న శివగంగలో, 21న రామనాథపురంలో ఆమె పర్యటిస్తారు. 22, 23 తేదీల్లో మళ్లీ మదురైలో పర్యటన సాగిస్తారు.